
ఈ వారం తెలుగు పుస్తకం

# సత్యశోధనలో వీరతిలకం దిద్దుకున్న "ఏది చరిత్ర?"

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్




Title: Yedi Charitra
Author : M.V.R.Sastry
Subject: HISTORY
Year of Publication: 2003
Price: USD $ 3.47

**అద్దము అబద్ధము చెప్పదు. కాని పగిలిన అద్దములో మన ముఖము వికృతముగా కనబడుతుంది. చరిత్ర కూడా అంతే. వక్రీభవించిన చరిత్రలో వాస్తవాలు మసి పూసి మారేడుకాయ చేయబడతాయి. పురుషోత్తముడు అలగ్జాండర్ చేతిలో ఓడిపోయాడు. విజయనగర రాజులు తొండలను, బల్లులను తినేవారు. అక్బరు మతసహనం కలవాడు. శివాజి చిట్టెలుక. రంజిత్‌సింగ్ బందిపోటు. ఇవే కదా మనం చదువుకునే చరిత్రలు! వీటిని చదువుకున్న జాతికి స్వాభిమానము, ఆత్మవిశ్వాసము కలుగుతుందా? ఆంగ్లేయులు బుద్ధిపూర్వకముగా భారతదేశ చరిత్రను వక్రీభవించారు. తాము వచ్చినట్లే తమకుముందు ఆర్యులు కూడా ఏ మధ్య ఆసియా ప్రాంతము నుండో వచ్చినవారేనని ప్రచారం చేసారు.**

ఆంగ్లేయులతో పాటు మన దేశంలో స్వాభిమానాన్ని కోల్పోయిన మరికొన్ని వర్గాలవారు కూడా ఇలాగే చరిత్రను తమకు అనుగుణంగా వ్యాఖ్యానించడం మొదలుపెట్టారు. ఈ దేశంలో ఒక జాతిలేదు, ఒక సంస్కృతి లేదు, ఒక నాగరికత లేదు. ఇది ఒక కలగూర గంప దేశం. ఇక్కడ ఉన్నది రెండే వర్గాలు. ఒకటి దోచుకునేది. రెండవది దోపిడికి గురిఅయ్యేది. ఈ రెండు శక్తుల సంఘర్షణలోంచే చరిత్ర పుట్టింది. ఇది ఒక వ్యాఖ్యానం. ఇలా మన విద్యార్థులు మెకాలే మానసపుత్రులకు, మార్క్సు వాదులకు మధ్య గత నూరేండ్లుగా నలిగిపోతూ ఉన్నారు. అట్లని సరియైన చరిత్రను నిరూపించే ప్రయత్నాలు అసలు జరగకపోలేదు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి వారితో ఆంధ్రదేశ చరిత్ర నిర్మింపబడింది. వి.డి.సావర్కార్ వంటి అతివాదులు, కోట వెంకటాచలం వంటి మితవాదులు కూడా నిజమైన భారతదేశ చరిత్ర నిర్మించడానికే తమ వంతు కృషిని చేసినప్పటికి అవి సర్వజనామోదం పొందలేదు. తాజ్‌మహల్ షాజహాన్ కట్టలేదు అని పి.ఎన్. ఓక్ ఓ వ్యాసం రాస్తే ఆయన్ని పిచ్చివాడనుకున్నారు. భారతదేశ చరిత్రను ముఖర్జీవంటి ప్రముఖులు కూడా మూడు మహాయుగములుగా విభజించారు. హిందుమహాయుగము, ముస్లిం మహాయుగము, బ్రిటిష్ మహాయుగము. ఇదీ విభజన. అంటే చరిత్రలో అలగ్జాండర్ దిగ్రేట్ అనే పేరు మాత్రమే ఉంటుందిగాని పురుషోత్తముని పేరు ఉండదు. అక్బర్ ది గ్రేట్ అనే అధ్యాయమే ఉంటుంది గాని రాణాప్రతాప్ పేరుండదు.

ఔరంగజేబు యొక్క పరమత సహనాన్ని గూర్చి విస్తృతమైన సెక్యులర్ వర్ణనలు ఉంటాయేకాని ఛత్రపతి శివాజీని వర్ణిస్తే అది కమ్యునల్ అవుతుంది. ఈ రకమైన మనస్తత్వం మన చరిత్ర నిర్మాతలకు గత 150 సంవత్సరాలుగా సంక్రమించింది. ఈ కారణం చేతనే శిశువులుగా పాఠశాలలలోనికి ప్రవేశించిన విద్యార్థులు శిశుపాలులుగా మారి బయటకి వస్తున్నారు. పశువులుగా భారతదేశాన్ని కబళిస్తున్నారు.

ఇటీవల తెలుగులో ఒక మహాప్రయత్నం జరిగింది. భారతదేశ చరిత్ర తిరిగి చెప్పబడింది. ఇది డిస్కవరి ఆఫ్ ఇండియా కాదు. అంటే చరిత్రకు వస్త్రాపహరణం చేయటం కాదు. అలంకారహీనంగా ఉన్న చారిత్రక సుందరిని సాలంకృతను చేయడం. ఈ పని చేసిన వ్యక్తి యూనివర్సిటీలో ప్రొఫెసర్ కాదు, పురాతత్త్వవస్తు పరిశోధకుడు కాదు. వృత్తిరీత్యా ఈయన ఒక జర్నలిస్టు. ప్రవృత్తిరీత్యా ఈయన ఒక సత్యాన్వేషి. భారతదేశ చరిత్రకు ఎక్కడో ఏదో తెగులు పట్టిందని ఆయన తన అధ్యయనంలో గ్రహించారు. అయితే నిస్పృహతోనూ అకర్మణ్యత్వం తోను ఆయన తనను తాను తిట్టుకుంటూనో చరిత్రను తిట్టుకుంటూనో కూర్చోలేదు. నిజమైన భారతదేశ చరిత్ర ఏమిటో చెప్పడానికి వారు ఒక అర్థవంతమైన ప్రయత్నం చేసారు. అది ఇంతింతై వటుడింతయై అన్నట్లు వామనత్వము నుండి త్రివిక్రమత్వాన్ని సంతరించుకుంది. ఆ త్రివిక్రముని పేరు *ఎం.వి.ఆర్.శాస్త్రి*. ఆయన ఎత్తిన మూడవ పాదము పేరు *ఏది చరిత్ర*.

ఇది 1/8 డెమ్మీ సైజులో వెలువడిన 300 పుటల గ్రంథము. ఇది మొదట *ఆంధ్రభూమి* దినపత్రికలో ప్రతి ఆదివారము ధారావాహికంగా 40 వారాలు ప్రచురింపబడ్డది. ప్రతివారము ఒక భూకంపాన్ని సృష్టించింది. వారం వారం చారిత్రక రసాయనాన్ని పంచిపెట్టింది. ఔరా అని ముక్కు మీద వేలు వేసుకొని చదివిన విద్వాంసులు కొందరైతే ఆశ్చర్య చకితులై ఈ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజాన్ని ఒక డిటెక్టివ్ నవలను చదివినట్టు యువతరంవారు చదివి ఆనందించారు.

ఒక సంవత్సరంలో ఒక చరిత్ర గ్రంథం నాలుగు ముద్రణలు పొందింది అంటే బహుశా అది తెలుగు ప్రచురణ చరిత్రలోనే ఒక రికార్డు కావచ్చు. ఇంతకూ 'ఏది చరిత్ర' ప్రత్యేకత ఏమిటి? దీనిని రచయిత మాటల్లోనే గమనిద్దాం.

"గతం మరచిన జాతికి భవిష్యత్తు చీకటి. మనం ఎవరమో, ఎప్పుడు ఎక్కడ బయలు దేరామో, ...బతుకు దారిలో ఎలాంటి కష్టాలు పడ్డామో. ఏ గొప్పలు చూశామో, ఏ తప్పులు చేశామో తెలిస్తే తప్ప గత కాలం గురించి సరయిన అవగాహన కలగదు. గతం తెలియనిదే వర్తమానం అర్థం కాదు. భవిష్యత్తుకు దారీ దొరకదు.

దారి దీపం కావలసిన భారత చరిత్ర విదేశీయుల చేతుల్లో అష్టావక్రంగా ఎలా తయారైందో... మహాక్రూరులను మహాపురుషులుగా, జాతీయ వీరులను చిల్లర తిరుగుబాటు దారులుగా చిత్రిస్తూ, విధ్వంసకులను నిర్మాతలుగా కీర్తిస్తూ కుహనా చరిత్రకారులు ఇన్నాళ్ళూ మనల్ని ఎలా మోసగించారో రుజువు చేసే శాస్త్రీయ విశ్లేషణ"

40 అధ్యాయాలు గల ఈ గ్రంథాన్ని అమెరికాలోని అచ్చ తెలుగు సంస్థ అజో-విభో-కందాళం ఫౌండేషన్ ప్రచురించింది. ఈ పుస్తకానికి రచయిత పెట్టిన పేరు *ఆర్యుల నుండి - ఔరంగజేబుల దాకా*. దీనికి ఆశీస్సులు అందిస్తూ శివశ్రీ కందుకూరి శివానందమూర్తిగారు ఇలా అన్నారు "భారతీయులు తమ చరిత్రని పురాణరూపంలో వ్రాశారు. పురాణంలో తాము తెలుసుకున్నది దేశ చరిత్రే అన్నమాట సామాన్యులకు తెలియకపోవచ్చు. ఎందుకంటే, చరిత్రతోపాటే, పురాణంలో దేవతలు, లోకాలు, ధర్మాధర్మాలు మొదలైనవాటితో కొన్ని అతిశయోక్తులు, వర్ణనలు, మతబోధలు కూడుకుని చరిత్ర చెప్పబడుతుంది. అందువల్ల పురాణంలో ఎవరికి ఏది కావాలో అది మిగతా విషయాన్ని పరిహరించి తీసుకోవచ్చు. కాని, నేడు మేధావులకు అనేక విషయాలు అస్పృశ్య విషయాలుగా ఉండటంచేత, చరిత్రకూడా అస్పృశ్యతకు గురైంది". ఈ వాక్యములను బట్టి మనకు అర్థమవుతున్నది ఏమిటి? మన వేదములలో చరిత్ర ఉంది, పురాణములలో చరిత్ర ఉంది. అల్లసాని పెద్దన వంటివారు రచించిన కావ్యావతారికలలో చరిత్ర ఉంది. కాని వీటిని పట్టించుకునేవాడు ఎవడు? ఇవన్నీ కవుల కల్పనలు అన్నారు. పుక్కిటి పురాణాలు అన్నారు. అతిశయోక్తులు అన్నారు. మరి నిజమైన భారతదేశ చరిత్ర

ఎక్కడనుండి వచ్చింది? పాశ్చాత్య శంఖాలనుండి వచ్చిన తీర్థాలనుండి వచ్చింది. అందుకని విస్సన్న చెప్పిందే వేదం అనే సామెతకు బదులు తెల్లన్న చెప్పిందే చరిత్ర అయింది. ఎం.వి.ఆర్. శాస్త్రిగారు చరిత్ర నిర్మాతకాదు, వ్యాఖ్యాత కాదు. కేవలం దర్పణంలో మన ముఖం మనకు చూపించారు. కాకుంటే మకిల పట్టిన అద్దాన్ని తుడిచి మరీ చూపించారు. నేను 'ఏది చరిత్ర'ను ఎందుకు రాశాను అనే పీఠికాభ్యాసంలో రచయిత ఇలా అన్నారు. "పాఠ్య గ్రంథాలల్లో చెప్పే చరిత్ర అంతా తప్పే. చిన్నప్పటినుండి వింటున్నాను ఈ మాట. ఆఖరికి స్కూల్లో మా సోషల్ స్టడీస్ మాస్టారు కూడా పాఠాల్లో ఉన్నది మొత్తం నిజమనుకోవద్దని అనేక సందర్భాల్లో హెచ్చరించేవారు.

ఇంగ్లీషువాళ్ళు వారి స్వార్థం కోసం తిమ్మిని బమ్మి చేసి తప్పడు చరిత్రను బనాయించారని తరువాత చాలా చోట్ల విన్నాను. ఇంగ్లీషువారు జెండాపీక్కునిపోయి ఇన్ని దశాబ్దాలు అయింది కదా, మరి వారు రాయించిన తప్పలను సరిచేసి సిసలైన జాతీయ చరిత్రను మనం ఎందుకు రాసుకోలేదు అని చాలా మందిని అడిగాను. సరయిన సమాధానం దొరకలేదు".

"సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్.సి.మజుందార్ ఆధ్వర్యంలో భారతీయ విద్యా భవన్ వెలువరించిన 11 సంపుటుల The History and culture of Indian people వంటి బృహద్గ్రంథాలు అనేకం లేకపోలేదు. కాని వాటిలోనూ ముఖ్యంగా ప్రాచీన చరిత్రకు సంబంధించి మాక్స్ ముల్లర్, విలియం జోన్సు వంటి అసంపూర్ణ ప్రజ్ఞావంతులు తెలిసీ తెలియక స్థిరం చేసిన కాలక్రమాన్నే, ప్రతిపాదించిన అడ్డగోలు వాదాలనే తిరుగులేని యథార్థాలుగా పరిగణించడం కనపడుతుంది".

ఇందులోని తొలి వ్యాసము *అబద్ధాల దండయాత్ర*. అందులో శాస్త్రిగారు తొలి పుటలో ఇలా అంటారు. ప్రపంచంలో ఏ దేశంలోనైనా సరే ఒక ఇంగ్లీషు వాడిని కాని ఒక జర్మన్ దేశస్థుడిని కాని ఒక రష్యన్‌ను కాని పిలిచి అయ్యా మీది చాలా గొప్పదేశం. అసలు ప్రపంచ నాగరికత మీతోనే మొదలయింది. లోకానికి వెలుగు చూపింది మీరే.అందుకు ఇవిగో రుజువులు అని చెబితే ఆయా దేశస్థులు ఎగిరి గంతేస్తారు. ఆ ఫ్రెంచ్‌వాళ్ళు, ఆ డచ్ వాళ్ళు ఎగిరి గంతేసి మీ నోట్లో చక్కర పోస్తారు. కాని అవే సంగతులు వరసబెట్టి మన భారతీయ మేధావికి చెప్పండి. చస్తే నమ్మను అంటాడు. పురాణాలలోంచి లేచొచ్చావా అని చడామడా తిడతాడు. ఇదే దురదృష్టం అయితే ఇప్పడు మనకు చాలా చారిత్రక శాస్త్రీయ ప్రమాణాలు లభించాయి. ఆర్యులు అలలు అలలుగా భారతదేశములోనికి వచ్చి క్రీపూ. 15వ శతాబ్దములో స్థిరపడ్డారు అంటే ఎవరూ నమ్మడం లేదు. మొహంజొదారో, హరప్ప, లోథాల్ ఆర్య సంస్కృతిని ప్రతిబింబించేవే కాని దస్యు నాగరికతలు కావని విద్వాంసులు తేల్చారు. మెసపొటేమియా, ఈజిప్ట్ సంస్కృతుల వంటివి కలిపి చూచినా భారతీయ సంస్కృతిలో పరిమాణంలోగాని నాణ్యతలోగాని సాటికి రాదగినవి కావని స్పష్టంగా తెలుస్తున్నది. కాని ఆంగ్లేయులు వారికి విధేయులైన ఇండాలజిస్టు ధృతరాష్ట్రులు, ఆర్యులు వేరని, ద్రావిడులు వేరని ప్రచారం చేయడం దురదృష్టకరం అంటారు శాస్త్రిగారు. ఈ విషయాన్ని సప్రమాణంగా- సుప్రసిద్ధ ఆర్కియాలజిస్టు డాక్టర్ ఎస్.ఆర్.రావు వంటి వారి మాటలను యథాతథంగా ఉదహరించారు.

"సరస్వతి నది కాల క్రమంలో పలుమార్లు గతిని మార్చుకుని, చిక్కిపోతుండగా పర్యావరణ వైపరీత్యాల వల్ల క్రీపూ.2200 ప్రాంతంలో కొన్ని వందల సంవత్సరాల తీవ్ర దుర్భిక్షం, వరదలు, భూకంపాల వంటి వైపరీత్యాలు బాధించిన కాలంలో మనం ఆర్యులనుకుంటున్న వారు పశ్చిమ, వాయవ్య దిశల్లో ఇండియా నుంచి ఇరాన్, పశ్చిమాసియా, యూరప్‌లకు దఫాలవారీగా వలస పోయారని శాస్త్రీయంగా రుజువైంది". "వేదాల అనంతర కాలానికి చెందిన శుల్బ సూత్రాలు, యజ్ఞశాలలు ఎలాకట్టాలో ఏ కొలతల ప్రకారం ఏ రీతిలో ఉండాలో నిర్దేశించాయి. సరిగ్గా హరప్పలోని యజ్ఞశాలలు, వైదికయజ్ఞశాలలు ఒకే రకంగా ఉన్నాయి. అంటే ఏమిటి? ద్రవిడ సంస్కృతి ఒక మిధ్య. ఉన్నది ఆర్య సంస్కృతియే సుమా" అంటారు శాస్త్రిగారు. *ఎండిన నదికి వందనం* అనే వ్యాసంలో వారు సరస్వతీనది స్వరూపాన్ని వివరించారు. ఇది అభూత కల్పన కాదు. ఋగ్వేదంలోని ఏడవ మండలం, రెండవ మండలం 41 వ సూక్తం ఏమని వర్ణించింది?

అంచితమే నదీతమే దేవీతమే అని సరస్వతిని ప్రశంసించారు. దీని గమనాన్ని బట్టి ఆర్యులు అత్యంత ప్రాచీనమైన వారని ఆర్యుల దండయాత్ర అభూతకల్పన అని శాస్త్రిగారు సైంటిఫిక్‌గా నిరూపించారు.

మాక్స్‌ముల్లర్‌ను మనవారు మోక్ష మూల తీర్థంకరుడు అని ప్రశంసించారు. అందుకు కారణం ఆయన వేదాల పై పరిశోధన చేయుటమే. కాని నిజానికి మాక్స్ ముల్లర్ ఆశించిన ప్రయోజనం ఏమిటి? అతని నిజస్వరూపం ఏమిటి? దానిని ఆయన తన భార్యకు రహస్యంగా వ్రాసిన ఈ ఉత్తరాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

"I feel convinced, though I shall not live to see it, that this edition of mine and the translation of the Veda will here after tell to a great extent on the fate of India... It is the root of their religion, and to show them what that root is, I feel sure, is the only way of uprooting all that has sprung up from it during the last 3000 years".

(The Life and Letters of Max Muller, Vol.I, P. 328)

ఇది మాయదారి మాక్స్ ముల్లర్ అనే వ్యాసంలో శాస్త్రిగారు చూపిన ప్రమాణం. ఆర్యశబ్దం ఎక్కడా జాతి వాచికంగా కాక శ్రేష్ఠ వాచకంగా వేదముల వంటివానిలో ప్రయోగింపబడింది. ముఖ్యంగా ఋగ్వేదంలో ఈ పదం 36 సార్లు వస్తుంది. అన్ని చోట్ల అది 'మాన్యుడు' అనే అర్థంలోనే వాడబడింది. "మహాకల కులీనార్య సభ్య సజ్జన సాధవః" (మంచి కుటుంబంలో పుట్టిన కులీనుడు, సభ్యత గలవాడు, సజ్జనుడు, సాధువు) అన్నవి *అమరకోశం* ఆర్య పదానికి చెప్పిన అర్థాలు. తమది వేరుజాతి, ఇతరులకు అందులో ప్రవేశంలేదు అనుకుంటే "కృణ్వంతో విశ్వమార్యమ్" (ప్రపంచమంతటనీ ఆర్యమయం చేద్దాం) అని వేదర్షులు అభిలషించే వారే కాదు. (పుట. 21) భారతీయ చరిత్రకు వేదములు, ఉపనిషత్తులు, పురాణములు ఆధారములే కావట. గ్రీకు చరిత్రకారుల ప్రాచీన గ్రంథాలే గీటురాళ్ళట. అలగ్జాండర్‌కు మూడు నాలుగు దశాబ్దాల తర్వాతి వాడైన Arrian,Strabo లకే అవి దొరకలేదు. అఖరికి నేటికీ మనం గొప్పగా చెప్పకుంటున్న మెగస్తనీస్ 'ఇండికా' కూడా రెండు మూడు శతాబ్దాలకే జాడ లేకుండా పోయింది. ఇవి మనకు ప్రమాణ వాక్యాలు. ఎవడు గుప్త చంద్రగుప్తుడో ఎవడు మౌర్య చంద్ర గుప్తుడో తెలియని పరిస్థితి. క్రీపూ.600 నాటి శంకరాచార్య క్రీస్తుకు తర్వాత 600 సంవత్సరాలకు ఎలా వెళ్ళిపోయాడు? గజనీ మహమ్మద్‌కు మత ద్వేషం లేదని ఆయన భారతదేశానికి వచ్చింది వ్యాపారం కోసమనీ కుహనా చరిత్రకారులు వ్రాస్తే వాటిని నోరు మూసుకుని మనవారు ఒప్పకున్నారు. గజనీ మహమ్మద్‌కు మన దేవాలయాలలోని డబ్బు మీదే ఆశ తప్ప ఆలయ విధ్వంసం ఆయన లక్ష్యం కాదని రొమిల్లా థాపర్ వ్రాస్తే సెహభాష్ అనుకొని ఆమెను హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికి అధిపతిగా నియమించాము. ఐతే ఇప్పడు శాస్త్రిగారు గజనీ దుర్మార్గాలను ఆయన పర్సనల్ సెక్రటరీ అరబ్బీలో వ్రాసిన వ్రాతలతోనే బయట పెడుతూంటే మనకు దిగ్భ్రాంతి కలిగి ఇప్పటివరకూ ఎందుకీ దొంగచరిత్రలు చదువుకున్నాము? అని బాధపడతాము.

గజనీగారి దుర్మార్గం ఆయనగారి ఆంతరంగికుడు అంటే పర్సనల్ సెక్రటరీ అబూనాసర్ మహమ్మద్ ఇబ్నె వ్రాసిన టర్కిస్ యామినిలో ఏముందో చూడండి. "మధురానగరం మధ్యలో ఓ పెద్ద దేవాలయం ఉంది. దీనితో సమానమైన దేవాలయం ఎక్కడైనా కట్టాలంటే పది కోట్లు దీనారులు (అంటే నేడు పదివేల కోట్లు దినారులు) పోసినా కట్టలేరు. నిర్మాణానికి కనీసం రెండువందల సంవత్సరాలు పడుతుంది". ఇంత మనోహరమైన దేవాలయాన్ని చూచి గజనీలో కళాతృష్ణ పెరిగిందట. అంతటి మనస్వి ఏం చేశాడు? "దేవాలయం మొత్తం నేలమట్టం చేయాల్సిందిగా తన సైనికులను ఆజ్ఞాపించాడు. ఇది ఎం.వి.ఆర్. శాస్త్రిగారి కల్పనకాదు. స్వయంగా గజనీగారి పర్సనల్ సెక్రటరీగారి మాటలే సుమా!.

అక్బరు రాణాప్రతాప్‌ను వేటాడి వేటాడి తాగేందుకు నీళ్ళు కూడా దొరకకుండా బావులల్లో విషం కలిపించాడు. ఆరావళీ పర్వత శ్రేణిలో ప్రతి చెట్టూ ప్రతి పుట్టా అక్బర్ పడిన బాధలకూ కన్నీళ్లకూ సాక్ష్యమిస్తాయని జేమ్స్‌టాడ్ తన గ్రంథంలో ప్రతాపుని సూర్య ప్రతాప తేజాన్ని వర్ణిస్తే మన దేశవాళీ పిండారీ గుంపు వ్రాసిన చరిత్రలు ఏమన్నాయో గమనించండి.

"రాణాప్రతాప్ వద్ద చాలా నిధులున్నాయి. కాబట్టి ఆయన అరణ్యంలో సుఖ జీవనమే సాగించి వుండవచ్చు" హిస్టరీ ఆండ్ కల్చర్ ఆఫ్ ఇండియన్ పీపుల్ ఏడవ భాగం 336 పుట. హల్దీఘాట్ యుద్ధంలో కనపడ్డ ప్రతి హిందువునూ నరికేయాలని అక్బర్ సేనాని ఆజ్ఞాపించినట్లు స్వయంగా అల్‌బదౌనియే వ్రాయగా అక్బర్ లాంటి ఉదారుడు అలాంటి పనులు ఎందుకు చేయిస్తాడు? అని చరిత్రకారుడు జె.ఎల్.మెహతా అక్బర్ తరపున వకాల్తా పుచ్చుకొని వాదించాడు.

ఇదీ మనవాళ్ళ మానసిక బానిసత్వం. భావ వ్యభిచారం. ఏది చరిత్రలో నలభై రెండు వ్యాసాలున్నాయి. అన్నీ ఇలాంటి ప్రామాణిక రచనలే. జేమ్స్‌టాడ్ వంటి వారి రచనలు చదివితే అక్బర్ ఎంతటి దుర్మార్గుడో తెలుస్తుంది. పోనీ, అక్బర్ స్వహస్తాలతో వ్రాసిన ఫత్‌నామా అయిన సమ్ముతారా ! ఇది 1568 మార్చి 9వ తేదిన అధికారికంగా జారీ చేయించిన అధికార పత్రం. చితొడ్‌ను నేలమట్టం గావించాక విజయోత్సాహంతో ఆగ్రాకు తిరిగివెళ్తూ అజ్మీర్‌లో ఆగినప్పుడు అక్కడి నుంచి "ఫత్‌నామా-ఇ-చితోడ్" పేర వెలువరించిన ఈ విజయ పత్రంలో తాను చేసిన ఘనకార్యాన్ని వివరిస్తూ "అక్బర్ ది గ్రేట్"గారు పలికించిన రత్నాల పలుకుల్లో మచ్చుకు కొన్ని.

The Omnipotent One who enjoined the task of destroying the wicked infidels on the dutiful mujahids through the blows of their thunder like scimitars laid down, "Fight them! Allah will chastise them at your hands and He will lay them low and give you victory over them.

(దుర్మార్గులైన అవిశ్వాసులను పిడుగుల్లాంటి తమ కృపాణాల పోట్లతో నాశనం చేసే కర్తవ్యాన్ని విధేయులకు అప్పగించిన సర్వశక్తిమంతుడు ఇలా నిర్దేశించాడు. 'వారితో పోరాడండి! మీ చేతుల్లో వారిని సరిచేసి, వారిని కింద వేసి, అల్లా మీకు విజయాన్ని ప్రసాదిస్తాడు').

We spend our precious time to the best of our ability in war and jihad and with the help of Eternal Allah.. We are busy in subjugating the localities, habitations, forts and towns which are under the possession of the infidels, may Allah forsake and annihilate all of them, and thus raising the standard of Islam everywhere and removing the darkness of polytheism... by the use of sword. We destroy the places of worship of idols in those places and other parts of India.

(మన విలువైన సమయాన్ని యుద్ధానికి, జిహాద్‌కు శాయశక్తులా వెచ్చిస్తాం. శాశ్వతుడు అయిన అల్లా సాయంతో... అవిశ్వాసుల స్వాధీనంలోని ప్రాంతాలను, జనావాసాలను, కోటలను, పట్టణాలను అణచివేయడంలో మనం నిమగ్నమయ్యాం. అల్లా వారందరిని త్యజించి, నిర్మూలించుగాక. కత్తిని ప్రయోగించి, ప్రతి చోటా బహుదేవతారాధన చీకటిని తొలగించి, ఇస్లాం పతాకాన్ని సర్వత్రా ఎగురవేస్తాం. హిందూస్తాన్‌లోని ఇతర ప్రాంతాలలోనూ విగ్రహారాధన స్థలాలను మనం నాశనం చేస్తాం).

ఈ మతాభినివేశంలో భాగంగా చిత్తోడ్ మీదికి ఎలా దండెత్తిందీ, మూడు పగళ్లూ మూడు రాత్రులూ భీకర సంగ్రామం చేసి కోటను ఎలా పట్టుకున్నదీ, ఎదిరించిన వారిని ఎలా నరికిపోగులు పెట్టినదీ నోరార వివరించాక ఫత్‌నామాలో ఇంకా ఇలా చెప్పారు.

...the whole victorious troop entred the fort. In accordance with the imperative command *"And kill the idolators all together"* those defiant ones who were still offering resistance... were put to death and their women and children taken prisoners... immense booty and spoils in cash and kind were acquired..., this auspicious fathnama is infact a foretaste of the victories to follow... written by the royal order (to be obeyed permanently) at Ajmer on 10th of the month of Ramzan 975 A.H.

(గెలిచిన సైన్యమంతా కోటలోకి ప్రవేశించింది. 'విగ్రహారాధకులందరినీ కలిపి చంపుడు' అన్న భగవదాజ్ఞ ప్రకారం మనకు ఇంకా తిరగబడుతున్న వారందరినీ చంపేసి, వారి స్త్రీలను, పిల్లలను ఖైదీలుగా పట్టుకున్నాం. నగదుగా, వస్తు రూపేణా బ్రహ్మాండమైన సొత్తు దొరికించుకున్నాం. ఈ ఫత్‌నామా శుభలేఖ నిజానికి మునుముందు రానున్న విజయాలకు సూచిక... (శాశ్వతంగా శిరసావహించవలసిన) రాజాజ్ఞ ప్రకారం అజ్మీరులో హిజ్రీ 975 సంవత్సరం రంజాన్ నెల 10వ రోజున వ్రాయబడినది).

విగ్రహారాధన విధ్వంసమే, అవిశ్వాసుల నిర్మూలనే తన ధ్యేయమని. కత్తితోనే దాన్ని సాధించ బూనానని స్పష్టంగా, సగర్వంగా ప్రకటించుకున్న ఈ ఔరంగజేబ్ ముత్తాతగారినే గొప్ప సెక్యులరిస్టుగా భావించి 'అక్బర్ దిగ్రేట్' అంటూ మన కుహనా లౌకికవాదులు నెత్తిన పెట్టుకుని ఊరేగుతున్నారు.

ఇలాంటిదే ఔరంగజేబ్, నాదిర్‌షా, తైముర్‌లవంటి పాశవికుల చరిత్ర. దొరలు మింగిన చరిత్ర. ఇంత జరిగినా మనం గుణపాఠం నేర్వని చరిత్ర. దాన్ని శాస్త్రిగారు సప్రమాణంగా రచించి మన కంట తడి పెట్టించారు.

"నాజీలు యూదులను 60 లక్షల మందిని గాస్ ఛాంబర్స్‌లో పెట్టి హతమార్చారు. ఐతే దానికన్నా ఇస్లామిక్ మూకలు వారి వారసులు సాగించిన జన సంహారం ఎన్నో రెట్లు పెద్దది. క్రీ.శ. 1000తో మొదలు పెట్టి క్రీ.శ. 1739దాకా తెరలు తెరలుగా వచ్చిన విదేశీ మూకలు సాగించిన హత్యలలో హతుల సంఖ్య కోట్లలోనే ఉంటుంది. 1399లో ఒక రోజునే తైమూర్ లక్షమందిని ఊచకోత కోయించాడు (పుట. 73) ఈ చరిత్రనంతా మన కుహనా మేధావులు ఎందుకు దాచి పెడుతున్నారు? ఎవరి అవసరాలు' స్వార్థాలు కాపాడబడాలని ఈ లోకవంచన, ఆత్మవంచన చేసుకొంటున్నారు? చరిత్ర తెలియని జాతి చరిత్ర హీనమవుతుంది. బ్రిటీషువారు అబద్ధాలు చెబితే వారి స్వార్థమేమిటో అర్థం చేసుకోగలం. కాని గత యాభై ఐదు సంవత్సరాలుగా మనం దానినే ఎందుకు చదువుకోవలసి వచ్చింది?

చిన్నా - పెద్దా- పండిత -పామర భేదం లేకుండా *"ఏది చరిత్ర?"* అందరూ చదవాలి. విజయాలనుండే కాదు, పరాజయాలనుండి కూడా మనం స్ఫూర్తి పొందవచ్చు.

యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్లు చేయలేని పని ఒక పత్రికా సంపాదకుడు చేసి చూపించాడంటే అది మొత్తం పత్రికాలోకానికే గర్వకారణం. నిజానికి మొగల్ సామ్రాజ్య పతనంతో ఈ పుస్తకం ఆగిపోయింది. అంటే ఈ చరిత్ర పరిశోధన ఇంకా సగం దారిలోనే ఉందన్నమాట. మిగిలిన సగం రెండవ భాగంగా వస్తే శాస్త్రిగారు భారతజాతికి ఎనలేని సేవ చేసిన వారవుతారు. చక్కని ముఖ చిత్రంతో ఈ గ్రంథాన్ని అందంగా ప్రచురించిన అజో-విభొ-కందాళం ఫౌండేషన్ సంస్థవారు అభినందనీయులు.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం బాల భారతి కల్చరల్ సెంటర్ (న్యూ జెర్సీ) వదాన్య సౌజన్యంతో అందించబడింది.